# వారం వారం

శ్రీశ్రీ

క్లిష్టంగా రాయడమంత సులభమైన పని లేనట్టే సులభంగా రాయడమంత కష్టమైన పనికూడా లేదు. ఆడంబరంగా జీవించడం సులభం. నిరాడంబరంగా బతకడం కష్టం. జీవితంలోనూ, సాహిత్యంలోనూ సౌలభ్యమే సాధించతగ్గ ఆశయం.

"........శతాంగభ్రష్ట సర్పద్విష జ్యేష్ఠుండప్పుడు నిష్ఠురప్రసర బంహిష్ఠ ద్యుతిశ్రేష్ఠతన్" అంటే ఆ ముక్కలకు అర్థం బోధపడని కారణం వల్లనే జనం చప్పట్లు కొడతారు. "అనూరుడుదయించెను" అంటే, అంతేనా, అంటారు.

అరవఫిల్ములు తెలుగుదేశంలో విరివిగా వ్యాపించడానికి కారణం అవి జనానికి బోధపడని భాషలో ఉండడమే. అందులో యేదో ఉండి ఉంటుందనే గుడ్డినమ్మకం. వున్నదేదో తెలిసిపోయినతర్వాత యేమీ లేదనే ఈసడింపుగా మారిపోతుంది.

ఎవరికీ బోధపడకుండా రాస్తాననని యెవడూ అనలేడు. నీ యెటువంటి రచననైనా అర్థం చేసుకోగలిగినవాడు ఇంకొకడుండ నేడుంటాడు. నిరర్థకమైన కాలంలో. విపులమైన పృథ్విలో యెప్పుడో, యెక్కడో-భవభూతి చెప్పినట్టే కాదు నువ్వు రాస్తున్న సమయంలోనే. నీదేశంలోనే వుంటాడు.

వందలకొద్ది సంవత్సరాలక్రిందటి శాసనాల భాషనే అవగాహన చేసుకొని అర్థం పిండగలిగినవారుండగా. ఈ నాటి సజీవభాషలో వ్రాసిన కావ్యాన్ని 'ఏమిటో, నాకు బోధపడదే' దనడమా?

"ఎర్రశాలువ కప్పుకొని మా ఇంటికొచ్చిందొక రివాల్వర్" అన్న వాక్యంలో అర్థంకాని మాట యేముంది? "వచ్చింది" అనే ప్రయోగం ఒకరకం మనిషికీ, "రివాల్వర్" అనేమాట ఇంకో అభిరుచిగల వ్యక్తికీ నసిపడక పోవచ్చును. ఈ మాటలలో చెప్పిన అభిప్రాయం మరి కొందరికి అసందర్భంగా కనబడవచ్చును. అందుకే యే కావ్యంగురించి, అయినా ఇది బాగులేదనడం సాహసం; అది నాకు నచ్చలేదనడం సమంజసం.

నవ్యకవిత్వానికి నియమాలు లేవనుకోవడం పొరపాటు. నవీనులు వొక తరహా నియమాలను నిరాకరించి వాటికి బదులు తాము తీసుకురాదలచుకున్న ఇంకొక పద్ధతిని ప్రవేశపెట్టదలుస్తున్నారు.

బ్రిటిష్ పరిపాలన కెదురుగా స్వరాజ్యోద్యమం, ధనస్వామ్య వ్యవస్థకు ధిక్కృతిగా సామ్యవాదపద్ధతీ, కమ్యూనిజానికి ఛాలెంజిగా అనార్కిజం నిలబడ్డ ఈ జీవితమే కావ్యరచనా విధానాలనుకూడా శాసిస్తుంది.

వర్ణసాంకర్యాన్ని అంగీకరిస్తున్న ఈ రోజులలో రససాంకర్యంకూడా ఆదరణీయమే. రెండు సంస్కృత సమాసాలకు మధ్య వొక తెలుగుమాట కొందరికి ఇబ్బంది కలిగించినట్టే, రెండు తెలుగు మాటల తర్వాత వొక అన్యదేశ్యం havoc కలిగిస్తుందనుకోవచ్చు.

కాని భావంలో బలం ఉంటే ఇప్పుడు కనిపిస్తున్న ఈ యెగుడుదిగుడులు సద్దుకుపోతాయి-ప్రేమ ఉంటే వర్ణాంతరవివాహం విజయం పొందినట్లు.

